క్లుప్తంగా

కనులపండువగా సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం

తోటమూల(గంపలగూడెం): మండలంలోని తోటమూల శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం 23వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చక బృందం సుబ్రహ్మణేశ్వర స్వామికి ముందుగా అభిషేకం భక్తి శ్రద్ధలతో జరిపారు. అనంతరం శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామి కల్యాణాన్ని కనులు విందుగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కన్యాదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు ప్రతి నెలా మాదిరిగానే ఈనెల కూడా నిత్యావసర సరుకులు అందజేసినట్లు ఎన్టీటీపీఎస్ రిటైర్డ్ డెప్యూటీ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం, హెచ్ఎంఈఎల్, మూలపాడు ప్రాంతాలకు చెందిన 35 మందికి అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఆలీ, డాక్టర్ ఆస్రా, ఎన్టీటీపీఎస్ ఏడీఈ నారాయణ ఆర్థిక సహకారంతో వీటిని సమకూర్చినట్లు తెలియజేశారు. హెచ్ఐవీ బాధితులు ధైర్యంతో అందుబాటులో ఉన్న మందులు వాడుతూ జీవితకాలం పొడిగించుకోవచ్చని తెలిపారు.

మొక్కలను పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారి



రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ, కూనపరాజుపర్వ, కుదప, రుద్రవరం గ్రామాల్లో ఆయిల్‌పామ్ మొదటి సంవత్సరం వేసిన మొక్కలను మండల ఉద్యానశాఖ అధికారి బి. నరేంద్రకుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు వేసిందీ లేనిది తెలుసుకుని వీటి వల్ల వచ్చే రాయితీలను వివరించామన్నారు. ఆయిల్‌పామ్ మొక్కలు వేయడం వల్ల మొక్కకు రూ. 198 చొప్పున హెక్టార్‌కు రూ. 29వేలు రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎరువులు మీద హెక్టార్‌కు రూ. 5,250 చొప్పున 4 సంవత్సరాలకు రూ. 21వేలు వస్తుందని అలాగే అంతర్ పంటగా ఒక్క వరి తప్ప ఏ పంట వేసిన హెక్టార్ పంటకు రాయితీ వస్తుందన్నారు. కావాల్సిన వారు ఆర్‌బీకేలో ఉన్న వీఏఏ, వీహెచ్ఏలను సంప్రదించాలని కోరారు.

పాడిరైతు కుటుంబానికి ఆర్థికసాయం

కాకర్ల(తిరువూరు): మండలంలోని కాకర్లలో పాలు సరఫరా చేసే రైతు మరణించగా, రూ.50వేల ఆర్థిక సాయాన్ని గురువారం లక్ష్మీపురం పాలశీతల కేంద్ర మేనేజర్ సాంబశివరావు అందజేశారు. గ్రామానికి చెందిన గడిపర్తి వెంకటేశ్వరరావు అనే పాల ఉత్పత్తిదారు మృతిచెందగా, క్షీరబంధు పథకం కింద రూ.50వేలను కృష్ణా మిల్క్ యూనియన్ మంజూరు చేసినట్లు సాంబశివరావు తెలిపారు. ఈ ఆర్థికసాయం చెక్కును లక్ష్మీపురం పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి నవీన్, కాకర్ల పాల ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షులు సగ్గుర్తి శేషగిరిరావు అందజేశారు.

నేడు పలు ఆలయాల హుండీల లెక్కింపు

నూజివీడు: పట్టణంలోని దేవదాయశాఖకు చెందిన పలు హుండీల లెక్కింపును ఈనెల 10న ఉదయం 10గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం (బస్టాండ్ వద్ద), శ్రీ వేంకటాచలస్వామి వారి దేవస్థానం, శ్రీ కోటమహిషాసురమర్దని అమ్మవారి ఆలయం, శ్రీదాసాంజనేయస్వామి వారి ఆలయంలోని హుండీలను తెరిచి దేవదాయ, రెవెన్యూ, పోలీసు సిబ్బంది, భక్తుల సమక్షంలో లెక్కించామన్నారు. ఎవరైనా భక్తులు పాల్గొనదలచిన వారు సంప్రదాయ దుస్తులు ధరించి హుండీల లెక్కింపులో పాల్గొనవచ్చన్నారు.

నేడు ధ్వజస్తంభ పునఃప్రతిష్ట

నూజివీడు: పట్టణంలోని డీఏఆర్ కళాశాల వద్ద ఉన్న కోట లోపల శివాలయంలో శుక్రవారం ఉదయం స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు పగడాల సత్యనారాయణ గురువారం చెప్పారు. దీనిలో భాగంగా ఈ నెల బుధ, గురువారాల్లో మహాగణపతి హోమం, గోపూజ, యాగశాల హోమాలు నిర్వహించామన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు దుర్గామల్లేశ్వర స్వామి శాంతి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

16న శ్రీరామ పట్టాభిషేకం

తిరువూరు: తిరువూరులో పునర్నిర్మించిన శ్రీకోదండ రామాలయంలో ఈ నెల 16న శ్రీరామ పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. వేదపండితులు ఉదయకుమారాచార్యులు ఆధ్వర్యంలో జరిగే శ్రీరామ పట్టాభిషేకం అనంతరం ఆలయంలో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొంది.

అంతటా సంక్షేమం, సుభిక్షం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



వలసపల్లిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

మునునూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి కుటుంబం సంక్షేమ పథకాలతో సుభిక్షంగా ఉందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని వలసపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు, కార్యకర్తలతో కలసి ముందుగా నాగేంద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. మహానేత వైఎస్సార్, బాబూ జగ్జీవన్ రామ్, ఏటికాలువ పంతులు పాటిబండ్ల శ్రీరామయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను పలకరిస్తూ, పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. మన ప్రభుత్వ హయాంలో దేవుని కరుణతో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు సుభిక్షంగా పండాయన్నారు. రబీ సాగు దెబ్బ తినకుండా నివారించేందుకు తమ్మిలేరు కాలువకు మంకొల్లు రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయించి లోపూడి, గుళ్లపూడి, గుడిపాడు, వలసపల్లి, యల్లాపురం, బలివే, వెంకటాపురం, వేల్పుచర్ల గ్రామాల్లోని అన్ని చెరువులను నింపుతున్నామన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా ప్రతి పథకంతో లక్షలాది మంది పేదలకు నేరుగా ప్రయోజనం కలిగిస్తున్నామన్నారు. రానున్న కాలంలో మరిన్ని పథకాలను పేద కుటుంబాలకు అందించనున్న జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అందరూ గుర్తించి, జగనన్నను మళ్లీ సీఎంను చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఎం. నాగ వల్లేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు మల్లినేని మురళీ, స్థానిక సర్పంచ్ సీహెచ్ దామోదర్, ఎంపీటీసీ సభ్యురాలు డి.రాటాలు, సొసైటీ అధ్యక్షుడు డి.సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ డీవీ సుబ్బారావు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ డి.సుధ, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, ఏపీఎం రాజశేఖర్, ఏపీఓ జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గురువారం కలిశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎం క్యాంప్ ఆఫీసులో పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛగ్రామాలు

జూపూడి(ఇబ్రహీంపట్నం): ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ గ్రామాలుగా తీర్చి దిద్దాలని జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు అన్నారు. జూపూడిలో సర్పంచి కాకి దేవమాత అధ్యక్షతన మైలవరం, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం మండలాల్లోని జూపూడి, వెల్వడం, పరిటాల గ్రామాల పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్‌మిత్రలు, రిసోర్స్ పర్సన్స్, ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. సీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా తడిపొడి చెత్త సేకరణలో ప్రతి ఒక్కరూ ముందుండి నడిపించాలన్నారు. ఇంటి వద్దే చెత్త వేరుచేయడంలో గృహిణులు ప్రధానపాత్ర పోషించాలన్నారు. చెత్త నుంచి తయారుచేసిన వర్మీ కంపోస్ట్ ఎరువుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో చెత్త సేకరణపై డెమో నిర్వహించారు. డీఎల్పీవో చంద్రశేఖర్‌రావు, ఎంపీడీవోలు రామకృష్ణనాయక్, లక్ష్మీకుమారి, శంకరరావు, ఈవోపీఆర్డీ బి.శ్రీనివాసరావు, కార్యదర్శి మునేశ్వరరావు పాల్గొన్నారు.



తడిపొడి చెత్త సేకరణ పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు, డీఎల్పీవో చంద్రశేఖరరావు

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో అప్పారావు, శ్రీనివాసరావు

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఎల్‌బీఆర్‌సీఈ)లో గురువారం జరిగిన ప్రాంగణ(క్యాంపస్) నియామకాల్లో కళాశాల ఎంబీఏ విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చి హెచ్‌సీఎల్ కంపెనీలో 22 మంది విద్యార్థులు ఫైనాన్సియల్ ఎనలిస్ట్ ఉద్యోగానికి, 48 మంది విద్యార్థులు ఐసీఐసీఐ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగాలకు ఎంపికయినట్లు కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి కె. కొండా శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను, ఇందుకు తోడ్పడిన అధ్యాపకులను, సిబ్బందిని కళాశాల చైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి, ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అభినందించారు.

సంక్షేమ పథకాలతో బడుగుల అభివృద్ధి

తిరువూరు శాసన సభ్యుడు రక్షణనిధి



చల్లగుండ్లవారి పాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

చల్లగుండ్లవారిపాలెం(గంపలగూడెం): రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బడుగు, బలహీన వర్గాలు అభ్యున్నతికి దోహదం చేస్తున్నాయని తిరువూరు శాసన సభ్యుడు కె. రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం పెనుగొలను–2 సచివాలయం పరిధిలో చల్లగుండ్లవారిపాలెంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని అన్ని వీధులలో తిరిగి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని తెలిపి, వారి వివరాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలో ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా 845 మందికి రూ. 2.29 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అర్హత ఉండి ఇంకా ఎవరికైనా పథకాలు అందకపోతే వెంటనే వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, పరిశీలించి పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేర అంతర్గత రహదారులలో సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి సచివాలయం నిధుల నుంచి రూ. ఐదు లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కోట శామ్యూల్, సర్పంచ్ సంగేపు లలిత, ఎంపీటీసీ సభ్యులు వడ్డెరబోయిన శ్రీను, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, చెరుకు నరసారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కే. దాసు, వి గోవర్ధనరెడ్డి, జి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అలాగే పెనుగొలను–2 సచివాలయం పరిధిలోని జింకలపాలెంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై. పిచ్చిరెడ్డి తెలిపారు.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పెనుగొలను(గంపలగూడెం): విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకొని పబ్లిక్ పరీక్షలలో ఉన్నత శ్రేణి మార్కులు సాధించాలని తిరువూరు శాసన సభ్యులు కె. రక్షణనిధి తెలిపారు. మండలంలోని పెనుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు డిస్ట్రిక్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా సరఫరా అయిన ఉచిత స్టడీ మెటీరియల్‌ను గురువారం ఆయన పంపిణీ చేశారు. పాఠశాలలో 47 మంది విద్యార్థులకు వీటిని అందించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, ఎంపీపీ జి. శ్రీలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యులు కే శామ్యూల్, సర్పంచ్ సంగెపు లలిత, ఎంపీటీసీ సభ్యులు వి. శ్రీను, పీఎంసీ చైర్మన్ ముక్కంటి, ఎంఈఓ సోమశేఖర్ నాయక్, ప్రధానోపాధ్యాయులు చంద్రం, సీఆర్‌పీ నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

మిత్ర పురుగులను కాపాడుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏఓ రాంకుమార్

జి.కొండూరు: పంటలకు మేలు చేసే మిత్ర పురుగులను కాపాడుకోవాలంటే రైతులు రసాయనిక మందుల వినియోగం తగ్గించుకోవాలని ఏఓ రాంకుమార్ అన్నారు. మండల పరిధి ఆత్కూరు గ్రామంలోని రైతు మొక్కజొన్న క్షేత్రంలో 'వైఎస్సార్ పొలం బడి' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాలె పురుగులు, అక్షింతాల పురుగులు, తూనీగలు, ట్రైకోగామా బదనికలు, పెంటో టోమిడ్ బగ్స్ వంటి మిత్ర పురుగుల వల్లన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): కొటికలపూడి గ్రామంలో పునర్నిర్మించిన దాసాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రతిష్టతో పాటు మహా గణపతి, కుమారస్వామి, దాసాంజనేయ స్వామి, ఆలయ శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పూజలు..

దాసాంజనేయస్వామి ఆలయం, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. అర్చక బృందం ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాడిపంటలు సుభిక్షంగా వర్ధిల్లుతాయని ఆయన అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వసంతను మెమెంటో అందజేసి ఘనంగా సత్కరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, వైస్ ఎంపీపీ బండి నాగమణి, సర్పంచి రెంటపల్లి నాగరాజు పాల్గొన్నారు.



దాసాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఆయిల్‌పామ్‌లో తెల్లదోమ నివారణకు చర్యలు

నూజివీడు: ఆయిల్‌పామ్‌లో తెల్లదోమ నివారణకు రైతులు ఉద్యాన అధికారులు సూచించిన యాజమాన్య పద్ధతులను పాటించినట్లయితే సమర్థంగా నిరోధించవచ్చని నూజివీడు ఉద్యాన అధికారి ఆర్. హేమ అన్నారు. ఎంఎస్‌పాలెం గ్రామంలో ఆయిల్ పామ్‌లో తెల్లదోమ నివారణకు రైతులు చేపట్టాల్సిన అంశాలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇసారియా శిలీంద్ర తల్లి ద్రావణాన్ని పిచికారీ చేసినట్లయితే తెల్లదోమ నివారించవచ్చన్నారు. శిలీంద్ర ద్రావణాన్ని తయారు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డీజీఎం పీఎం కొండారెడ్డి, సిబ్బంది, రైతులు, ఉద్యాన శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇసారియా శిలీంద్ర ద్రావణాన్ని తయారు చేసే విధానాన్ని తెలుపుతున్న ఉద్యాన అధికారి

బహిరంగ మరుగుదొడ్ల ఏర్పాటుకు వినతి

నూజివీడు: నూజివీడులో బహిరంగ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. వెంటనే సులభ్ కాంప్లెక్స్ తరహాలో మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలో బస్టాండ్ సెంటర్ మినహా మిగిలిన చోట్ల మరుగుదొడ్లు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, మహిళల అవస్థలు చెప్పలనవి కాదన్నారు. దీనికి సబ్‌కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాజశేఖర్, పట్టణ అధ్యక్షులు దోసపాటి జనార్దనరావు, ప్రధాన కార్యదర్శి మురళీమోహన్‌రావు పాల్గొన్నారు.

కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మునిసిపాలిటీ నూతన కమిషనర్‌గా సీహెచ్ వెంటేశ్వర్లును నియమిస్తూ రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ ఆదేశాలు జారీచేశారు. కొండపల్లి మునిసిపాలిటీలో వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చీరాల మునిసిపాలిటీ మేనేజర్‌గా ఇప్పటి వరకు పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన పర్వతనేని శ్రీధర్ పిడుగురాళ్ల మునిసిపాల్టీ రెవెన్యూ అధికారిగా బదిలీ అయ్యారు. నూతన కమిషనర్ వెంకటేశ్వర్లుకు ఉద్యోగులు స్వాగతం పలికి అభినందించారు. బదిలీ అయిన కమిషనర్ పర్వతనేని శ్రీధర్‌కు ఉద్యోగులు వీడ్కోలు పలికారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పి. జాహ్నవి మైలవరం నియోజకవర్గం శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం గొల్లపూడిలోగల ఆయన కార్యాలయానికి వచ్చిన ఆమె మొక్క బహూకరించారు. అలాగే కొండపల్లి మున్సిపాలిటీ నూతన కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు కృష్ణప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమ ప్రభుత్వాన్ని నడుపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా కష్టపడి పనిచేయాలని ఆకాంక్షించారు.



కృష్ణప్రసాద్‌కు మొక్క అందజేస్తున్న తహసీల్దార్ జాహ్నవి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

ఆదర్శప్రాయుడు ఎస్వీ సారథి

మైలవరం: నేటి తరం యువత సీనియర్ సీపీఎం నాయకుడు ఎస్వీ సారథిరావును ఆదర్శంగా తీసుకోవాలని ఆ పార్టీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ తెలిపారు. సీపీఎం సీనియర్ నాయకుడు, ఉమ్మడి కృష్ణా జిల్లా రైతు సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన ఎస్వీ సారథిరావు 10వ వర్ధంతిని గురువారం మైలవరం నూజివీడు రోడ్డులోని రైతు సంఘం కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సారథిరావు విగ్రహానికి పూల మాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ నిరుపేదల సమస్యల పరిష్కారానికి సారథిరావు చేసిన పోరాటాలను కొనియాడారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీ.వీ. ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ఎస్వీ సారథిరావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

పంట కాలువలోకి పల్టీకొట్టిన కారు



జూపూడి(ఇబ్రహీంపట్నం): వేగంగా దూసుకొచ్చిన కారు పంట కాలువలోకి దూసుకెళ్లి పల్టీకొట్టింది. మండలం పరిధిలోని జూపూడి వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ఈఘటన జరిగింది. కొండపల్లికి చెందిన కొందరు నందిగామ వైపు నుంచి కొండపల్లి వెళ్తున్న సమయంలో కారు ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కకు పల్టీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న కోటేశ్వరమ్మ అనే వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న నిమ్రా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సాగునీటి యాజమాన్యంలో జాగ్రత్త వహించాలి

మునుకుళ్ళ(తిరువూరు): వరి సాగులో నీటి యాజమాన్యం ఎంతో కీలకమని, నీటిని పొదుపుగా వినియోగిస్తే నాణ్యమైన దిగుబడి వస్తుందని తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కెనడీ సూచించారు. మండలంలోని మునుకుళ్లలో రైతులకు సాగునీటి యాజమాన్యంపై పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నాట్లు వేసే సమయంలో, ఆ తర్వాత కూడా తగినంత నీటిని మాత్రమే అందించాలని, మోతాదుకు మించినా, తగ్గినా నష్టం తప్పదని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ సురేష్, తిరువూరు ఏవో పద్మ, విజయవాడ రైతు శిక్షణ కేంద్ర అధికారి సత్యవతి పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు రెండేళ్ల పదవీకాలం పూర్తి

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): గ్రామాల్లో పదవులు చేపట్టిన సర్పంచులకు రెండేళ్లు పూర్తయ్యాయి. 2021 ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగి పలువురు సర్పంచులు బాధ్యతలు స్వీకరించారు. గురువారంతో రెండేళ్లు పూర్తయి మూడో ఏడాదిలోకి అడుగుపెట్టారు. ఈ నేపథ్యంలో కొటికలపూడి సర్పంచి రెంటపల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కేక్ కట్‌చేశారు. సర్పంచులకు అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.


రేపు జాతీయ లోక్ అదాలత్

తిరువూరు: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. శివకిరణ్ తెలిపారు. రాజీ చేసుకోదగిన కేసులను లోక్‌అదాలత్‌లో కక్షిదారులు పరిష్కరించుకోవాలని, ఉదయం 10 గంటల నుంచి అదాలత్ జరుగుతుందని తెలిపారు.

20న మండల సర్వసభ్య సమావేశం

ఆగిరిపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 20న మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.వాణి గురువారం చెప్పారు. ఎంపీపీ గోళ్ల అనూష, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులందరూ హాజరు కావాలన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి



ఏమ్మార్ అప్పారావు పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకట రామును సత్కరిస్తున్న అధ్యాపకులు

నూజివీడు: విద్యార్థులు పట్టుదలతో అంకుఠిత దీక్షతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సెస్ ప్రిన్సిపాల్ ఆచార్య వి. వెంకట రాము అన్నారు. స్థానిక ఎమ్మార్ అప్పారావు పీజీ కాలేజీలో కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన మొదటి సంవత్సరం పీజీ విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు గురువారం స్వాగత వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సబ్జెక్టుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను సైతం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ కో–ఆర్డినేటర్ సీహెచ్ ఈ రత్నం, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ షేక్ అన్వర్‌పాషా, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

మైలవరం: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రేమతో పెంచాలని, కొట్టకూడదని ప్రవాసాంధ్రుడు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి తెలిపారు. మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 15వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల స్థలదాత, భవన నిర్మాణం దాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని . మైలవరం డివిజన్ ఏసీపీ ఎమ్ రమేష్ మాట్లాడుతూ ఇటువంటి కళాశాలలో చదవడం, పనిచేయడం అదృష్టంగా భావించాలన్నారు. కార్యక్రమంలో లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం అకడమిక్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందించారు.

11న సిల్వర్ జూబిలీ వేడుకలు

మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సిల్వర్ జూబిలీ వేడుకలు ఈ నెల 11న కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మైలవరంలోని కళాశాల ప్రాంగణంలో గురువారం జరిగిన సమావేశంలో జయప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల 180 మంది విద్యార్థులతో మొదలై నేడు 5000 మంది విద్యార్థులకు చేరువైందన్నారు.